క్లుప్తంగా

నేత్రపర్వంగా శేష వాహన సేవ



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. కామాక్షిదేవి, సంగమేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

చలివేంద్రాల ప్రారంభం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి బస్‌స్టేషన్ ఆవరణలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ సోమవారం ప్రారంభించారు. అసోసియేషన్ నాయకులు నెల్లూరు వీరారెడ్డి, ఏట కిషోర్‌బాబు, కుడుముల సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
కావలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆది ఫౌండేషన్ సహకారంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కావలి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ హరినారపరెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓ బాధ్యతల స్వీకరణ



సీతారామపురం : మండలం ఉపాధి హామీ పథకం ఏపీఓగా ఎన్ శ్యామల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా పనిచేస్తున్న సుభాషిణి వింజమూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జలదంకి ఏపీఓగా పని చేస్తున్న శ్యామల బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఏపీఓ మాట్లాడుతూ మండలంలో జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు చేపడుతామన్నారు. కొలతల ప్రకారం పనులు చేయించి కూలీలకు వేతనాలు పూర్తిస్థాయిలో అందేలా చూస్తామన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



సోమశిల: వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతసాగరం తహసీల్దార్ సుభాషిణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ ద్వారా జీతాలు చెల్లించాలని, డీఏను వేతనాలతో కలిపి ఇవ్వాలని, వీఆర్‌ఏలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఆవు దాడిలో నలుగురికి గాయాలు

అల్లూరు: స్థానిక పాత చేపల మార్కెట్ ప్రాంతంలో సోమవారం ఓ ఆవు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. రోడ్డుపై తిరిగే ఓ ఆవు పిచ్చి పట్టినట్లుగా ప్రవర్తిస్తూ మనుషులు కనిపిస్తే దాడి చేయసాగింది. స్థానికులు సాహసించి ఆవును తాళ్లతో బంధించి కట్టేశారు. ఆవును పిచ్చికుక్క కరిచి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా గతంలోనూ అల్లూరులో ఆవు దాడి చేయడంతో ఒకరు చనిపోయారు. రోడ్లపైకి ఆవులను వదిలేయడంతో నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించడమే కాకుండా ఒకదానికొకటి పొడుచుకుంటూ మనుషులను గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపైకి ఆవులను వదిలి పెట్టకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా చావడి గంధ మహోత్సవం

అల్లూరు: శ్రీరామనవమి సందర్భంగా అల్లూరుపేటలో షిర్డీ సాయిబాబా చావడి గంధమహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పూలతో విశేషంగా అలంకరించిన సాయిబాబా చిత్రపటంతో ఊరేగింపుగా మసీదుసెంటర్‌లోని దర్గా, కోనేటి సెంటర్‌లోని దర్గా వద్దకు చేరుకుని హిందూ, ముస్లింలు గంధానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా మందిరానికి చేరుకుని హిందూ, ముస్లింలు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సూక్ష్మ సేద్యం.. ప్రయోజనాలు అధికం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు మర్లపాటి కుమార్. కలిగిరి మండలం వీరారెడ్డిపాళెం గ్రామం. ఆరెకరాల్లో నిమ్మతోట సాగు చేస్తున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్ల క్రితం ఏపీఎంఐపీ అధికారులకు దరఖాస్తు చేసుకోగా 70 శాతం రాయితీతో నిమ్మతోటకు డ్రిప్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం నిమ్మతోటలో డ్రిప్‌ను ఉపయోగించి అంతర పంటగా పుచ్చసాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. సూక్ష్మసేద్యం ద్వారా నీరు, విద్యుత్ వినియోగంతో పాటు కూలీల ఖర్చులు తగ్గాయని కుమార్ చెబుతున్నారు.

- సబ్సిడీపై సూక్ష్మసేద్యం పరికరాలు
- ఏపీఎంఐసీ ద్వారా మంజూరు
- బోరు, పొలం కలిగిన ప్రతిరైతు అర్హుడే



డ్రిప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రయోజనాలు ఇవీ

- 50 శాతం వరకు నీటిని ఆదా చేసుకోవచ్చు.
- విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చు.
- కలుపు నివారణ ఖర్చులను తగ్గించుకోవచ్చు.
- 30 శాతం అదనంగా నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చు.
- డ్రిప్ సిస్టం ద్వారా ఎరువులను అందించడం వల్ల పంటలకు నేరుగా అందుతాయి.
- వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉండడంతో చీడపీడల దాడి తక్కువగా ఉంటుంది.
- నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చు.
- డ్రిప్ విధానంలో ఎకరాకు సుమారు 30 శాతం వరకు పెట్టుబడులను ఆదా చేసుకోవచ్చు.

కలిగిరి: జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. రైతులు వరితో పాటు వాణిజ్య, ఉద్యాన పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా బిందు, తుంపర సేద్యం పరికరాలను (డ్రిప్, స్ప్రింక్లర్లు) రైతులకు సబ్సిడీపై అందజేస్తోంది. సూక్ష్మసేద్యం విధానంలో పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధికంగా ప్రయోజనాలు పొందుతున్నారు. సూక్ష్మసేద్యం పరికరాలను సబ్సిడీపై పొందేందుకు పొలం, బోరు కలిగి ఉన్న ప్రతిరైతు అర్హుడే. బహిరంగ మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేయాలంటే అధిక ధరలు వెచ్చించాలి. అయితే అవి అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో నామమాత్రం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ఏపీఎంఐపీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు తయారు చేసి సబ్సిడీపై మంజూరు చేస్తారు. ఎంపిక చేసిన కంపెనీల ద్వారా పొలాల్లో పంటలకు సూక్ష్మసేద్యం పరికరాలను త్వరితగతిన అమరుస్తారు. మైక్రో ఇరిగేషన్ అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా మామిడి, నిమ్మ, జామ, దానిమ్మ, బత్తాయి, బొప్పాయి, తదితర పండ్ల తోటలతో పాటు కూరగాయలు, పూలసాగు, ఆయిల్‌పామ్, తదితర పంటలను సూక్ష్మసేద్యం ద్వారా చేపడుతున్నారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ 2,982 మంది రైతులకు సంబంధించిన 3604 హెక్టార్లలోని పంటల సాగుకు ఏపీఎంఐపీ అధికారులు రూ.20.17 కోట్ల రాయితీతో సూక్ష్మసేద్యం పరికరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రైతుల దగ్గర నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నారు. .

సబ్సిడీ వివరాలు

ఆంధ్రప్రదేశ్ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ద్వారా డ్రిప్ సౌకర్యానికి ఐదెకరాల్లోపు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ అందజేస్తున్నారు. 5 నుంచి 10 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు 50 శాతం రాయితీని ఇస్తున్నారు. స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీని అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు జీఎస్టీ చెల్లిస్తే 100 శాతం రాయితీని ఇస్తున్నారు. సూక్ష్మసేద్యం పరికరాలు అవసరమైన రైతులు ఆధార్, భూమి యాజమాన్యహక్కు పత్రంతో మండల ఉద్యానవనశాఖ అధికారి లేదా గ్రామ వ్యవసాయ సహాయకుడు లేదా గ్రామ సెరీకల్చర్ సహాయకుడు సాయంతో రైతు సేవా కేంద్రంతో పాటు మైక్రో ఇరిగేషన్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పారదర్శకంగా అర్హుల ఎంపిక



పారదర్శకంగా అర్హులైన రైతులను ఎంపిక చేసి సూక్ష్మసేద్యం పరికరాలను అందజేస్తున్నాం. జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించినా ఎంత మందికి అర్హత ఉన్నా మంజూరు చేస్తున్నాం. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులకు డ్రిప్ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుంది. కూరగాయలు, పండ్లతోటల్లో సూక్ష్మసేద్యాన్ని వినియోగించడం ద్వారా మంచి దిగుబడులు వస్తున్నాయి.

– బీ శ్రీనివాసులు, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎంఐపీ



స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ సాగు

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని టౌన్–1 ఫీడర్ పరిధిలో మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ ఎస్‌కే నాగూరువలీ సోమవారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మార్పు పనులు చేపడుతున్న కారణంగా బంగ్లాసెంటర్ నుంచి షఫీ ఆస్పత్రి వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

కావలి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో జరిగిన వైద్య శిబిరంలో అపోలో ఆస్పత్రికి చెందిన వైద్యులు షర్మిలినాషీన్, మస్తాన్‌వలీ, సతీష్ పగడాల సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి జలజనాభయ్య, ట్రెజరర్ వెంకయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఉదయగిరి: వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 17 ఏళ్ల యువతి అదృశ్యంపై తల్లి లక్ష్మీదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటున్న కుమార్తె ఆదివారం అదృశ్యమైందని ఫిర్యాదులో పేర్కొంది. స్పందించిన ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేశారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: ప్రభుత్వం మహిళల స్వయం ఉపాధికి ఉచితంగా అందజేస్తున్న కుట్టు శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకులు గౌసియా సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు చెక్కనగిషీ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



వింజమూరులో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న మాసిలామణి



సీతారామపురంలో వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ



అనుమసముద్రంపేటలో ..

అనుమసముద్రంపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌పేటలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజులమ్మ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని కోరారు. హెచ్ఈఓ చిన్నయ్య, పీహెచ్ఎన్ రాజసులోచన, సూపర్‌వైజర్లు రషీద్, కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
సీతారామపురం : స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. వైద్యాధికారిణి స్వప్నారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు.
కావలి : గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే నవజాత శిశువుల మరణాల సంఖ్యను తగ్గించవచ్చని ప్రముఖ గైనకాలజిస్ట్ ఏ నళినిపద్మ పేర్కొన్నారు. పట్టణంలోని పాతవూరులో ఉన్న శ్రీలక్ష్మి కాలేజీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీక్లబ్, జన విజ్ఞాన వేదికల సహకారంతో ఆరోగ్యంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. కళాశాల కరెస్పాండెంట్ కే మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కే సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ గోపి, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత, జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు పాల్గొని ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన్‌రావు, రోటరీ క్లబ్‌కు చెందిన ఏ రమేష్‌రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, నల్లూరి రవికుమార్, జేవీవీ సభ్యులు ఖాదర్‌బాషా, గాదిరెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.
వింజమూరు(ఉదయగిరి): సుజాతనగర్ కాలనీలో ఎంఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రశాంత్, ట్రస్ట్ సభ్యులు స్నేహ, ప్రీతిక, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్‌లో క్యాంపస్ ఎంపికలు



కావలి: స్థానిక డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సింగపూర్‌కు చెందిన కంపెనీల ప్రతినిధులు సోమవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. సీఎస్ఈ విభాగానికి చెందిన 50 మంది విద్యార్థులు క్యాంపస్‌కు హాజరవగా, మూడు రౌండ్లలో ప్రతిభకనబర్చి ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ టీవీ రావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు బస్సు సర్వీసు ప్రారంభం

ఉదయగిరి: ఉదయగిరి నుంచి కర్నూలుకు నూతన బస్సు సర్వీసును డిపో మేనేజర్ శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరిలో ఉదయం ఏడు గంటలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. బద్వేలు, మైదుకూరు, నంద్యాల మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు కర్నూలుకు చేరుతుందన్నారు. తిరిగి సాయంత్రం 3 గంటలకు బయలుదేరి అదేమార్గంలో రాత్రి 9 గంటలకు ఉదయగిరి డిపోకు చేరుకుంటుందని వివరించారు. నూతన సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

అల్లూరు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీని అందజేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా ఏకమొత్తంగా ఆస్తి పన్నును చెల్లించివారికి మాత్రమే రాయితీని అందజేస్తామని చెప్పారు. నగర పంచాయతీ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలంద విద్యార్థుల ప్రతిభ

కావలి: పట్టణంలోని గొల్లమూడి వారి వీధిలో ఉన్న నలంద ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభా పోటీల్లో సత్తాచాటారు. సైన్స్, గణితంలో విద్యార్థుల జ్ఞానాన్ని పరీక్షించడానికి నిర్వహించిన ఈ వార్షిక పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను నలంద స్కూల్ డైరెక్టర్ వశీం సోమవారం అభినందించారు.

10న అబిద్‌బాబా గంధమహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని కోనకాలువ వద్ద ఉన్న హజరత్ సూఫీ సయ్యద్ ఆల్‌ఔజ్ జైనులుద్దీన్ ఖాదరియా చిష్తి (అబిద్‌బాబా) దర్గాలో 22వ గంధమహోత్సవాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంధోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాల ప్రారంభం



మర్రిపాడులో మాట్లాడుతున్న మంత్రి ఆనం

మర్రిపాడు/సంగం: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు, సంగంలోని వెలుగు కార్యాలయాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసి ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఏడు కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళల స్వయం ఉపాధికి 90 రోజుల పాటు కుట్టు శిక్షణను అందించి ఉతంగా కుట్టుమెషీన్‌ను ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం అమలు చేయనున్నట్ల తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20వేలు అందజేస్తామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, ఎంపీడీఓలు నాగేశ్వరప్రసాద్, షాలెట్, తహసీల్దార్లు అనిల్‌కుమార్, సోమ్లానాయక్, ఏపీఓ మధు, తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 425 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 336 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.230, సరాసరిన రూ.263.61 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. వేలంలో పది కంపెనీలు పాల్గొన్నాయి.
మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 541 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 624 బేళ్లు రాగా, 541 బేళ్లను కొనుగోలు చేశారని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.230, సగటున రూ.265 ధర పలికిందని వివరించారు. వేలంలో 12 కంపెనీలు పాల్గొన్నాయి.

చేజర్ల విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి చిత్ర కళా పోటీల్లో ప్రతిభకనబరిచారు. డ్రీమ్‌వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో సాయిశశాంక్, కామాక్షి, వైష్ణవి, మంజునాయక్, సబ్ జూనియర్ విభాగంలో పీ చైతన్య, నోక్షిత సత్తాచాటి బంగారు, వెండి పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్‌కుమార్‌ను హెచ్ఎం పీ హైమావతి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

వైభవంగా గజ వాహనోత్సవం



ఆత్మకూరు: గజ వాహనంపై సీతారాములు



ఆత్మకూరురూరల్: కరటంపాడులో సీతారాముల కల్యాణోత్సవం



అల్లూరులో కోదండరాముని రథోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని పంటవీధి రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గజ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం సీతారాములను గజ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. కాగా సుందరమ్మ కోదండ రామాలయంలో ఆదివారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా యద్దనపూడి కుటుంబీకులు వ్యవహరించారు. భారతి సంగీత నృత్య విద్యాలయం విద్యార్థులు నాదనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నృత్య ప్రదర్శ, భక్తి పాటలు ఆలపించిన చిన్నారులు కే వినీషా, శాంతి, ఎస్ సంగీత, నృత్య విద్యాలయం నిర్వాహకులు అపర్ణ, చక్రవర్తిలను ఉత్సవాల నిర్వాహకులు సన్మానించారు.

వేడుకగా అశ్వ వాహనోత్సవం

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వ వాహనోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించి సీతారాములకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు. రాత్రి యాదవరాజులు ఉభయకర్తలుగా వ్యవహరించి మేళతాళాల నడుమ పూజాసామగ్రిని తీసుకెళ్లి పూజలు, అలంకరణలు నిర్వహించారు.

నేత్రపర్వగా సీతారాముల కల్యాణం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లభనేని రాజేంద్ర దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి సీతారాములకు పట్టువస్త్రాలను సమర్పించారు.

కనులపండువగా రథోత్సవం

అల్లూరు: అల్లూరుపేటలో కోదండరామస్వామి రథోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. అల్లూరుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సీతారాములను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. మినర్వా గ్రాండ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ చైర్మన్ అల్లంపాటి లోకేశ్వరరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆక్రమణలను తొలగించాలి

సోమశిల: అనంతసాగరం మండలం ఇనగలూరు పంచాయతీ పరిధిలోని ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ స్థలంలోని బావిని పూడ్చి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఓ మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే చెరువు నుంచి పంట పొలాలకు వచ్చే కాలువను ఆక్రమించడంతో దిగువన ఉన్న పొలాలకు సాగునీరు అందక కొన్నేళ్లుగా బీడులుగా ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 9 రోజుల పాటు జరిగే బహ్మోత్సవాలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆలయంలో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల్లో విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

అర్జీలు ఇస్తున్నా సమస్యలను పరిష్కరించరా?



అధికారులను నిలదీస్తున్న రైతు రామానాయుడు

ఉదయగిరి: కాళ్లరిగేలా తిరుగుతూ రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందజేస్తున్నా పరిష్కరించరా అంటూ పలువురు అర్జీదారులు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అధికారులను నిలదీశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో తిరుమలాపురానికి చెందిన రైతు ఎస్ కృష్ణయ్య తన గోడును అధికారుల ఎదుట వెలిబుచ్చాడు. తనకు సర్వేనంబర్ 216–2లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, రెవెన్యూ రికార్డుల్లో సర్వేనంబర్ 216–1గా నమోదైందని, దాన్ని సరిచేయాలని పలుమార్లు అర్జీలు అందజేసినా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దాసరపల్లికి చెందిన సయ్యద్ అన్వర్‌బాషా తన భార్య రిహానా బేగం పేరుపై అప్పసముద్రం గ్రామంలో సర్వేనంబర్ 1223–7లో 2.06 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు తమ వద్ద ఉన్నా కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కొట్టాలపల్లెకు చెందిన కే రామానాయుడు భూసమస్యను మూడునెలలుగా పరిష్కరించకపోవడంతో తహసీల్దార్ సుభద్ర, రీసర్వే డీటీ జహీర్‌ఖాన్‌తో వాగ్వివాదానికి దిగారు. సమస్య పరిష్కరించకుండా రేపు,మాపు అంటూ కాలయాపన చేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం తగదన్నారు.